క్లుప్తంగా

వైభవంగా పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామ తీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన పూజల నంతరం యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక హవనం చేసి పూర్ణాహుతి జరిపించారు. తరువాత స్వామి వెండి మంటపం వద్ద శ్రీ సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నెలరోజుల పాటు యాగశాలలో నిర్వహించిన సుందరకాండ హవనానికి పుష్యమి నక్షత్రం సందర్భంగా పూర్ణాహుతి జరిపించామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో మద్దిలి గణేష్ ఇటీవల మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆ కుటుంబాన్ని ఆదివారం కలిసి పరామర్శించారు. గణేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆయన వెంట వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ ఉన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

విజయనగరం క్రైమ్: నగరంలోని ఆర్టీవో ఆఫీసులో శనివారం రాత్రి జరిగిన బోరు చోరీతో పాటు ఆ పక్కనే ఉన్న సెట్విజ్ ఆఫీసులోని మోటారు దొంగతనానికి సంబంధించిన కేసులో నలుగురు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలపై ఇదివరకే వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది రమణ, రాజులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా నలుగురిని తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

- ముగుస్తున్న మొదటి అర్ధ సంవత్సరపు పన్ను చెల్లింపు గడువు
- జూలై 1 వస్తే వడ్డీతో కలిపి చెల్లించాల్సిందే..
- ఆస్తిపన్ను వసూలు డిమాండ్ రూ.17.84 కోట్లు
- ఇప్పటివరకు వసూలు చేసినది రూ.13.18 కోట్లు



భవన సముదాయాలతో విజయనగరం వ్యూ

పన్ను చెల్లింపునకు.. నేడే ఆఖరు!

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించేందుకు సమయం దగ్గర పడింది. ఏడాదిలో మొదటి అర్ధ సంవత్సరపు పన్ను మొత్తం చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీతో గడువు ముగియనుంది. నెలాఖరులోగా ఈ మొదటి అర్ధ సంవత్సరపు పన్ను చెల్లించకుంటే వడ్డీ భారం తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. పన్ను చెల్లించేందుకు ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో భవన యజమానులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత పన్ను చెల్లించేందుకు ముందుకు వచ్చే వారిపై రూ.100కి రూ.2 చొప్పున వడ్డీ భారం పడుతుందని చెబుతున్నారు.

ఏడాదిలో రెండు దఫాలు..

వాస్తవానికి ఆర్థిక సంవత్సరంలో రెండు దఫాలుగా నగరాలు, పట్టణాల పరిధిలోని భవన యజమానుల నుంచి అధికార యంత్రాంగం పన్నులు వసూలు చేస్తోంది. దీనిలో భాగంగా తొలి విడతగా జూన్ నెలాఖరు వరకు వసూలు చేస్తారు. రెండో విడతగా డిసెంబరు నెలాఖరులోగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఈ రెండు విడతల్లో నిర్ణీత సమయానికి పన్ను చెల్లించని వారికి రెండు శాతం వడ్డీ విధిస్తారు. ఈ మేరకు జూన్ నెలాఖరులోగా మొదటి అర్ధ సంవత్సరపు పన్ను చెల్లించాలి. అధికారిక లెక్కల ప్రకారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 70,725 అసెస్‌మెంట్లు ఉండగా వాటిలో ప్రైవేటు భవనాలు 70,525, ప్రభుత్వ భవనాలు 157, కోర్టు కేసుల్లో ఉన్నవి మరో 43 వరకు ఉన్నాయి. వీటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం పాత, కొత్త బకాయిలు కలిపి రూ.83 కోట్లకు పైగా ఆదాయం రావాల్సి ఉంది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించిన డిమాండ్ రూ.17.84 కోట్లు ఉండగా ఇప్పటివరకు రూ.13.18 కోట్లు వసూలు చేసినట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. ఈ లెక్కన మరో రూ.4.52 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

మొండి బకాయిలెప్పుడో..?

గత ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో పన్నుల వసూళ్లు జరిగినప్పటికీ 2024–25 ఆర్థిక సంవత్సరంతో పాటు గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ఆస్తి, నీటి పన్నులతో పాటు ఖాళీస్థలాల నుంచి వసూలు కావాల్సిన మొత్తం రూ.కోట్లల్లో బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఈ బకాయిలన్నీ వస్తే నగరం మరింత అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పన్నులు చెల్లించడం బాధ్యత..



2025–26 ఆర్థిక సంవత్సరానికి భవనాలు, నీరు, ఖాళీస్థలాల ద్వారా పన్నుల వసూళ్లకు ప్రజల్లో అవగాహన కల్పించాం. ఈ నెలాఖరులోగా మొదటి అర్ధ సంవత్సరం పన్ను మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. లేని పక్షంలో వడ్డీ భారం తప్పదు. ఈ విషయమై యజమానులకు నోటీసులు కూడా జారీ చేశాం. కొంతమంది పన్నులు చెల్లించేందుకు ఆసక్తి చూపడం లేదు. అందరూ చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది.

– పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

మిద్దెపంటల సాగును ప్రోత్సహించాలి



కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ నల్లనయ్య, పక్కనే మిద్దెపంటల ఆవశ్యకతను వివరిస్తున్న హరిత విజయ నగరం కమిటీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి

విజయనగరం: మిద్దెపంటల సాగు విధానాన్ని ప్రోత్సహించాలని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. నగరంలో ఆదివారం జరిగిన హరిత విజయనగరం ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. సేంద్రియ ఎరువులు, మిద్దెపంటల ఆవశ్యకతపై కాసేపు మాట్లాడారు. 200 మంది హరిత విజయనగరం సభ్యులు ఓ కమిటీగా ఏర్పడి మిద్దెపంటలు, సేంద్రియ ఎరువుల తయారీలో చొరవ చూపడం అభినందనీయమన్నారు. చెత్తతో ఎరువు తయారు చేయడమే కాకుండా ఆ ఎరువును మిద్దెపంటలకు వినియోగించి ఆదర్శంగా నిలుస్తుండడం, పర్యావరణ పచ్చదనానికి పాటుపడుతుండడం చాలా మంచి విషయమన్నారు. పర్యావరణ హితం కోరుకునే ప్రతి ఒక్కరూ సేంద్రియ ఎరువులు వినియోగించాలని, అలాగే మిద్దెపంటలు పండించుకోవాలన్నారు. అనంతరం హరిత విజయనగరం కమిటీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి కూడా మిద్దెపంటలు ఏ విధంగా పండించుకోవాలి.. వాటి వల్ల కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో బెహరా రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



సదాశివం దంపతులను సత్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ విమలరాణి, కార్యాలయ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ఉద్యోగులకు వారి ఉద్యోగ కాలంలో చేసిన మంచి సేవలే గుర్తింపునిస్తాయని ఐసీడీఎస్ పీడీ టి.విమలరాణి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 30న ఉద్యోగ విరమణ కానున్న ఐసీడీఎస్ కార్యాలయ సూపరింటెండెంట్ సదాశివం దంపతులను ఆ శాఖ ఉద్యోగులు ఆదివారం ఘనంగా సన్మానించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ సదాశివం.. అందరితో స్నేహపూర్వకంగా ఉంటూనే నీతినిజాయితీతో విధులు నిర్వహించారని ప్రశంసించారు. కింది స్థాయి ఉద్యోగులను కూడా గౌరవిస్తూ తన హుందాతనాన్ని చాటుకునే వారన్నారు. రిటైర్‌మెంట్ తర్వాతి జీవితం కూడా ఆదర్శవంతంగా ఉండాలని, ఆ భగవంతుడు నిండుగా ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీపీయూ లక్ష్మి, గృహహింస కౌన్సిలర్లు జిల్లెల రజని, మాధవి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.విజయలక్ష్మి, డీసీపీయూ ప్రతినిధి నాగరాజు, సంధ్య, చైల్డ్‌లైన్ ప్రతినిధులు చప్ప అరుణ్‌కుమార్, అనిల్, మీనా, గౌరి మాళి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి, సీఐటీయూ అరుణ పతాకాన్ని నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు ఆవిష్కరించారు. అనంతరం సుబ్బారావమ్మ మాట్లాడుతూ కార్మిక వర్గంపై కేంద్రంలోని ఎన్‌డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నాడు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు, యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లుగా అమలు చేసేందుకు సిద్ధం కావడం దుర్మార్గమన్నారు. కార్మిక శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. లేబర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిశ్రమల్లో కార్మికులకు భద్రత లేదని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. 2012 నుంచి కనీస వేతనాల సవరణ జరగలేదని, బోర్డును కూడా వేయలేదన్నారు. ఏపీలోనూ కూటమి ప్రభుత్వం ఒకే రకమైన పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఎందుకు జీతాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటి ఎల్‌ఐసీ, పోస్టల్, టెలికాం, స్టీల్‌ప్లాంట్, రైల్వే, ఆర్మీ వంటి వ్యవస్థలను సైతం అమ్మకానికి తయారవ్వడం అన్యాయమన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా చేపట్టే సమ్మెలో అందరూ పాల్గొని, మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎ.జగన్మోహనరావు, రమణ, రవికుమార్, ప్రభ, రామనాయుడు, మహాలక్ష్మి, భాస్కరరావు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

- హామీల అమలులో చంద్రబాబు ప్రభుత్వం విఫలం
- అధికారంలోకి వచ్చి, ఏడాదైనా కానరాని పథకాలు
- మరోవైపు రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా కుట్రలు
- అక్రమ కేసులతో వైఎస్సార్ సీపీ నాయకులను భయపెట్టే యత్నం
- మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్ర ప్రజానీకాన్ని కూటమి ప్రభుత్వం మోసగిస్తున్న తీరును ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసివచ్చిన వీరభద్రస్వామి..నగరంలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పార్టీ అభివృద్ధికి పాటుపడాల్సిన తీరు, చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను జనంలోకి తీసుకువెళ్లడంపై దిశానిర్దేశం చేశారు. అనంతర మీడియాతో మాట్లాడారు. ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న ఆశతో కూటమిగా జతకట్టి, అమలు సాధ్యం కాని హామీలతో జనాన్ని మోసం చేస్తున్నారని కూటమి సర్కారుపై మండిపడ్డారు. ఒకటెండ్రు పథకాలు అరకొరగా అమలు చేసి, మొత్తం చేసేసినట్లు ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి, ఆ తర్వాత వాటిని విస్మరించడం చంద్రబాబుకు అలవాటు అయిపోయిందన్నారు. ఎన్నికలప్పుడు కూటమి ఇచ్చిన హామీలు.. ఇప్పటివరకు అమలు చేసిన పథకాలెన్ని.. అవి ఎలా అమలవుతున్నాయని ఒక్కసారి పరిశీలిస్తే వాటి అమలు తీరు ఎలా ఉందో ఇట్టే అర్థమైపోతుందన్నారు. ఇప్పటివరకు దీపం పథకం కింద ఇస్తున్న గ్యాస్ డబ్బులు కూడా కొంతమందికి రాలేదన్నారు. తల్లికి వందనం కూడా చాలామందికి అందలేదన్నారు. మేనిఫెస్టోలో ఏడాదికి నాలుగు సిలిండర్లు అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు మూడు సిలిండర్లే ఇస్తున్నారని వాటి డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. మరోవైపు తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తానన్నారని, ఇప్పుడేమో వైఎస్సార్ సీపీ హయాంలోని డేటా ఆధారంగా పాతవారికే అది కూడా రూ.13 వేలు మాత్రమే వేశారన్నారు. ఈ డబ్బులు కూడా చాలా మంది ఖాతాల్లో జమ కాలేదన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి, ఓట్లు దండుకున్న కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక జనానికి ముఖం చూపించేందుకు భయపడుతున్నారని, దీని బట్టి వారి పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజలెక్కడ నిలదీస్తారోనని ముఖం చాటేసుకుని తిరుగుతున్నారని దుయ్యబట్టారు. అప్పట్లోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను ఇప్పుడిప్పుడే ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. సంక్షేమం అంటే జగనన్న.. జగనన్న అంటే సంక్షేమమని అనుకుంటున్నారన్నారు.

త్వరలోనే కమిటీల నియామకాలు..

పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ సంస్థాగత బలోపేతానికి నగర, మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో కమిటీల నియామకాలను త్వరలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా పార్టీకి సంబంధించిన 29 అనుబంధ కమిటీల నియామక ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్న ఆలోచన ఉన్న వారు ముందుకు వస్తే వారి సమర్థతను బట్టి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. పార్టీ అధిష్టానం సూచనల మేర నడిచేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలని పార్టీ నేతలను కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మోసాలు వివరించడంతో పాటు జగనన్న చేసిన మంచిని తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా కుట్ర జరుగుతోందని, అందుకే అక్రమంగా వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులపై కేసులు పెట్టి వేధించడం జరుగుతోందన్నారు. వీటన్నింటినీ ప్రజలకు తెలియజేయాలని, ఆ విధంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు కదులుదామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, సంగంరెడ్డి బంగారునాయుడు, ఉపాధ్యక్షుడు బొద్దాన అప్పారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యలత, జిల్లా కార్యదర్శి దుప్పాడ సునీత, పార్టీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాద్, నాయకులు దోలా మన్మథకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి మత్స్యకారుల సమస్యలు

విజయనగరం టౌన్: ప్రభుత్వం దృష్టికి మత్స్యకారుల సమస్యలు తీసుకువెళ్తానని ఏపీ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు నడికుదిటి అర్జున్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు అన్నారు. నగరంలోని యువజన వసతిగృహంలో సంప్రదాయ మత్స్యకారుల జీవన విధానం, అభివృద్ధి, పెంపుదలపై ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 14 ఉపకులాల మెరుగైన జీవనానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మన సమస్యల పరిష్కారానికి మనమంతా ఐక్యంగా ఉండాలని కోరారు.

సాహిత్యంతోనే సమాజ చైతన్యం

విజయనగరం టౌన్: సాహిత్యంతోనే సమకాలీన సమాజం ఏర్పడుతుందని గజపతినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు, రచయిత్రి చెల్లపిల్ల శ్యామల అన్నారు. స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్రం గ్రంథాలయం ఆవరణలో విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో సాహిత్యం–సమాజం అనే అంశంపై ఆదివారం సాయంత్రం సభ నిర్వహించారు. సాహిత్యంపై అందరూ మక్కువ పెంచుకోవాలని, సాహిత్యం ద్వారానే సమాజ చైతన్యం సాధ్యమన్న విషయం మర్చిపోవద్దన్నారు. అనంతరం రచయిత్రి శ్యామలను సన్మానించారు.